హైదరాబాద్‌లో పీబీపార్టనర్స్ ఆఫీస్

హైదరాబాద్, ఆగస్టు 30: పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్‌కు చెందిన పీబీపార్టనర్స్..తెలంగాణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వచ్చే రెండు నెలల్లో హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు కస్టమర్ కేర్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు పీబీపార్టనర్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భదోరియా తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే రెండేండ్లలో వరంగల్, కరీంనగర్‌తోపాటు వైజాగ్, తిరుపతి, కోయంబత్తూరులలో కార్యాలయాలను తెరువాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో 5,500కి పైగా ఎజెంట్లు ఉన్నారని, వచ్చే రెండేండ్లలో ఈ సంఖ్యను రెండింతలు పెంచుకోనున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటికి పైగా వాహన పాలసీలు విక్రయించినట్లు, దీంట్లో తెలంగాణలో 3 లక్షలు, ఏపీలో 3.5 లక్షలు ఉన్నాయన్నారు.

విస్తారా కనుమరుగు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: చౌక విమానయాన సంస్థ విస్తారా ఎయిర్‌లైన్స్ ఇక కనుమరుగుకాబోతున్నది. విస్తారా బ్రాండ్‌తో నవంబర్ 11న తన చివరి విమాన సర్వీసును నడుపబోతున్నది. టాటా గ్రూపునకు చెందిన ఎయిర్ ఇండియాలో నవంబర్ 12 నుంచి విలీనం కానుండటంతో తన బ్రాండ్ సేవలు నిలిచిపోనున్నాయని తాజాగా వెల్లడించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక ఎయిర్ ఇండియా–విస్తారా విలీనం కాబోతున్నాయి. టాటా గ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా గతంలో విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేశాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రభుత్వరంగ విమాన యాన సంస్థ ఎయిర్ ఇండియాను టాటా గ్రూపు కొనుగోలు చేయడంతో తన అనుబంధ విమానయాన సంస్థలను ఒక్కతాటిపైకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. విలీనం తర్వాత ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా కలిగివుండనున్నది. ఇప్పటికే ఇరు సంస్థలు విమానాలకు సంబంధించి లావాదేవీలు కలిసి నిర్వహిస్తున్నాయని, ముఖ్యంగా ఉద్యోగులు కలిసి పని చేస్తున్నారని ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు.

జీడీపీ డౌన్.. ఇన్‌ఫ్రా స్లో

తొలి త్రైమాసికంలో 15 నెలల కనిష్టానికి వృద్ధిరేటు

- ఈ ఏప్రిల్-జూన్‌లో 6.7 శాతానికే పరిమితం
- జూలైలో 6.1 శాతానికి మందగించిన కీలక రంగాల పనితీరు
- తాజాగా విడుదలైన కేంద్రప్రభుత్వ గణాంకాల్లో తేటతెల్లం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశ ఆర్థిక వ్యవస్థను నిస్తేజం ఆవరించింది. ఓవైపు వృద్ధిరేటు.. మరోవైపు కీలక రంగాల పనితీరు మందగించాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో దేశ జీడీపీ 15 నెలల కనిష్టానికి దిగజారినట్టు తేలింది. అలాగే జూలై నెలకుగాను 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు 6.1 శాతానికే పరిమితమైనట్టు స్పష్టమైంది.

వ్యవసాయ, సేవా రంగాలు డీలా

వ్యవసాయ, సేవల రంగాల ప్రదర్శన పేలవంగా ఉండటమే ఈ ఏప్రిల్–జూన్‌లో దేశ జీడీపీ వృద్ధిరేటు 5 త్రైమాసికాల కనిష్టాన్ని తాకుతూ 6.7 శాతానికే పరిమితం కావాల్సి వచ్చిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) పేర్కొన్నది. 2023 జనవరి–మార్చిలో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ స్థాయి దరిదాపుల్లోకి ఇప్పుడే గణాంకాలు వెళ్లాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023–24) ఏప్రిల్–జూన్‌లో 8.2 శాతంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జనవరి–మార్చిలోనూ 7.8 శాతం వృద్ధి కనిపించింది. దీంతో 3 నెలల్లో జీడీపీ 1 శాతానికిపైగా పడిపోయినట్టైంది.

ఆయా రంగాలవారీగా..

ఈ ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగ జీవీఏ (గ్రాస్ వాల్యూ ఆడెడ్) 3.7 శాతం నుంచి 2 శాతానికి క్షీణించినట్టు ఎన్ఎస్‌వో తెలియజేసింది. అలాగే ఆర్థిక, నిర్మాణ, ప్రొఫెషనల్ సర్వీసెస్ జీవీఏ కూడా నిరుడు ఏప్రిల్–జూన్‌తో పోల్చితే 12.6 శాతం నుంచి 7.1 శాతానికి దిగజారింది. ట్రేడ్, హోటల్స్, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లోనూ వృద్ధి 9.7 శాతం నుంచి 5.7 శాతానికి పతనమైంది. ఈ క్రమంలోనే ప్రధానమైన తయారీ రంగ జీవీఏ 2 శాతం పెరిగి 7 శాతానికి పుంజుకున్నా.. మైనింగ్–క్వారీయింగ్, విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సర్వీసుల్లో ఆకర్షణీయ వృద్ధి ఉన్నా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే ప్రస్తుత ధరల వద్ద ఈసారి జీడీపీ విలువ రూ.77.31 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఓ ప్రకటనలో ఎన్ఎస్‌వో తెలిపింది.

మౌలికం బేజారు

దేశ పారిశ్రామిక ప్రగతికి ప్రామాణికంగా భావించే 8 కీలక రంగాల్లో మందగమనం అలుముకున్నది. గత నెల జూలైలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోని ఉత్పాదకతలో వృద్ధిరేటు 6.1 శాతంగానే ఉన్నది. నిరుడు జూలైలో ఇది 8.5 శాతంగా ఉండటం గమనార్హం. భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండటం విశేషం. అలాంటిదిప్పుడు ఆయా రంగాల్లో ఉత్పత్తి ఏడాది కాలంలో 2.4 శాతం మేరకు పడిపోయింది. ముడి చమురు ఉత్పత్తి మైనస్ 2.9 శాతంగా, సహజ వాయువు ఉత్పత్తి మైనస్ 1.3 శాతంగా ఉండటం దెబ్బ తీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బొగ్గు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోనూ ఉత్పాదకత గతంతో పోల్చితే వరుసగా 6.8 శాతం, 7.2 శాతం, 5.5 శాతం, 7 శాతాలకు పడిపోయింది. దీంతో రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాల్లో 6.6 శాతం, 5.3 శాతం చొప్పున వృద్ధి నమోదైనా ప్రయోజనం లేకపోయింది.

గూగుల్ పేలో కొత్త ఫీచర్లు

- యూపీఐ సర్కిల్ పరిచయం
- ఈరూపీ వోచర్ల జారీ, ట్యాప్‌అండ్‌పే పేమెంట్లూ షురూ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రముఖ పేమెంట్స్ యాప్ గూగుల్ పేలో కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే శుక్రవారం యూపీఐ సర్కిల్‌సహా మరికొన్నింటిని పరిచయం చేశారు. ముంబైలో 3 రోజులపాటు జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2024 ముగింపు సందర్భంగా ఈ మేరకు గూగుల్ పే నుంచి ప్రకటనలు వచ్చాయి. కాగా, యూపీఐ సర్కిల్‌తో గూగుల్ పే వినియోగదారులు (ప్రైమరీ యూజర్లు) తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను సెకండరీ యూజర్లుగా అనుమతించవచ్చు. దీంతో తమ బ్యాంక్ ఖాతాను లింక్ చేసుకోకుండానే ఇకపై వీరంతా కూడా ప్రైమరీ యూజర్ అకౌంట్ ద్వారానే డిజిటల్ చెల్లింపులను జరుపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) భాగస్వామ్యంతో దీన్ని తీసుకొచ్చింది. అలాగే ఈ సందర్భంగా యూపీఐ వోచర్స్ (ఈరూపీ)నూ గూగుల్ పే ప్రారంభించింది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రస్తుత యూపీఐ వినియోగదారులు వీటిని జారీ చేయవచ్చు. అంతేగాక రూపే కార్డుల కోసం ట్యాప్‌అండ్‌పే చెల్లింపుల సౌకర్యాన్నీ కల్పించింది. ఈ పేమెంట్స్ కోసం రూపే కార్డుదారులు తమ మొబైల్ ఫోన్లను కార్డులతో అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. యూపీఐ లైట్ కోసం ఆటోపే ఆప్షన్, యాప్‌పై క్లిక్‌పే క్యూఆర్ కోసం సపోర్ట్‌నూ అందిస్తున్నది. కాగా, ఆర్థిక వ్యవస్థలో డిజిటలైజేషన్‌ను మరింత విస్తృతపర్చడానికి ఈ నెలలో జరిగిన ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన అనుమతుల మేరకే ఈ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి.

బ్రోకర్లపై సెబీ కొరడా

46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీల రిజిస్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. 46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీ సంస్థలపై కొరడా ఝుళిపించింది. నిబంధనల మేరకు లేని 39 స్టాక్ బ్రోకర్లు, 7 కమోడిటీ బ్రోకర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం రద్దు చేసింది. అలాగే 22 డిపాజిటరీ పార్టిసిపెంట్స్ రిజిస్ట్రేషన్లనూ క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. రిజిస్ట్రేషన్లు రద్దైనా.. స్టాక్ లేదా కమోడిటీ బ్రోకర్లుగా, డిపాజిటరీ పార్టిసిపెంట్లుగా గతంలో తీసుకున్న చర్యలకు, వైఫల్యాలకు ఇకపైనా వారు బాధ్యులేనని వేర్వేరుగా ఇచ్చిన తాజా ఆదేశాల్లో సెబీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెబీకి బాకీపడిన వడ్డీలు, ఫీజులు, ఇతరత్రా బకాయిలను చెల్లించాల్సిందేనన్నది.

ఆర్థికాభివృద్ధిలో విదేశీ వాణిజ్యం కీలకం

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ శశాంక్ గోయల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విదేశీ వాణిజ్యం, పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) కేంద్రం డైరెక్టర్ జనరల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ చెప్పారు. విదేశీ వాణిజ్యం కేవలం జీడీపీని మాత్రమే కాదు.. ఉద్యోగావకాశాలు, వేతనాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఐటెక్ విభాగం సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తల శిక్షణా కోర్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోయల్ మాట్లాడుతూ.. ఈజిప్ట్, భారత్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు

చారిత్రాత్మకంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు, వారి దేశాభివృద్ధికి దోహదపడేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయని చెప్పారు. అనంతరం ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు కోర్సు పూర్తి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రవులపాటి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

10 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపర్లలో ఖుషి

ముంబై, ఆగస్టు 30: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజు కొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న సూచీలు శుక్రవారం మరో మైలురాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల జోరు కొనసాగుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఫలితంగా ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 231.16 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో 2,228 సూచీలు లాభపడగా, 1,701 సూచీలు నష్టపోయాయి. మరో సూచీ నిఫ్టీ సైతం ఉన్నత శిఖరానికి చేరుకున్నది. వరుసగా 12 రోజులుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ శుక్రవారం సైతం 83.95 పాయింట్లు ఎగబాకి 25,235.90 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపరుల సంపద రూ.10 లక్షల కోట్లు పెరిగింది. గత తొమ్మిది సెషన్లలో సెన్సెక్స్ 1,941 పాయింట్లు లాభపడటంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.10,00,028 కోట్లు పెరిగి రూ. 4,64,39,993.77 కోట్లు (5.54 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వచ్చే నెలలోనే ఫెడ్ వడ్డీరేట్లను తగ్గించనుండటంతో గ్లోబల్ మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిశాయి..దీంతో దేశీయ సూచీలు కూడా పరుగులు పెట్టాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



- మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు(1.57 శాతం), నిఫ్టీ 412.75 పాయింట్లు(1.66 శాతం) లాభపడ్డాయి. గత తొమ్మిది రోజుల్లో సెన్సెక్స్ 1,941(2.41 శాతం), నిఫ్టీ 1,097 పాయింట్లు(4.54 శాతం) చొప్పున పెరిగాయి.
- వారాంతం ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, సన్ ఫార్మా షేర్లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతోపాటు టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లెలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టాటా మోటర్స్, రిలయన్స్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతిలు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.88 శాతం బలపడగా, హెల్త్‌కేర్ 1.41 శాతం, యుటిలిటీస్, కమోడిటీస్, టెక్, సేవల రంగ షేర్లు కదంతొక్కాయి.

కొండపై స్వామివారికి పూజలు చేస్తున్న శ్రీధర్‌రావు

బుగులు వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

చిల్పూరు, ఆగస్టు 30 : శ్రావణ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతంతో అభిషేకించారు. కొండపైన వెలిసిన స్వామి వారికి చందనం, కుంకుమ, తులసీ దళాలతో అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు చేసినట్లు ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది మూల మల్లికార్జున్, గాదె రాజశేఖర్, రాజేశ్, విష్ణు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతులకు సమస్యలు

కొడకండ్ల, ఆగస్టు 30 : కాంగ్రెస్ పాలనలో రైతులకు సాగునీటి సమస్యతోపాటు పంట రుణాల మాఫీ జరగక ఇబ్బందులు పడుతున్నారని జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ మోహన్‌గాంధీనాయక్ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి నియోజకవర్గంలోని రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోదావరి జలాలున్నా వాటిని రిజర్వాయర్లలో నింపి చెరువులు, కుంటలు నింపడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో కాల్వల్లో నీరు లేక పంటలకు సాగునీరందడం లేదన్నారు. ఈసారి రైతుభరోసా పథకాన్ని అమలు చేయలేదని, దీంతో రైతులు అరిగోస పడుతున్నారని గాంధీనాయక్ తెలిపారు. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీరందక వందలాది ఎకరాలు బీడుగా మారాయని పేర్కొన్నారు.

జెండా గద్దె తొలగింపుపై మాట్లాడుతున్న మాజీ ప్రజాప్రతినిధులు

రాఘవాపూర్‌లో జెండా గద్దె వివాదం

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 30 : మండలంలోని రాఘవాపూర్‌లో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేద్కర్ జెండా గద్దెను తొలగించిన ఘటన బీసీ, ఎస్సీ కులస్తుల మధ్య గొడవకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. రాఘవాపూర్‌లో కొన్నేళ్ల క్రితం జీపీ స్థలంలోని ధరంబావి కూడలిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జెండా గద్దెను తొలగించి డ్రైనేజీపై పెట్టారు. దీంతో స్థానిక దళిత, యువజన నాయకులు జీపీ స్థలంలో అంబేద్కర్ వారసులకు హక్కులు లేవా అని ప్రశ్నించారు. గద్దెను డ్రైనేజీపై పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ జీ వేణు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించగా, సమస్యను పరిష్కరించుకుంటామని సీఐకి స్థానికులు హామీ ఇచ్చారు. కాగా ఈ సమస్యను పరిష్కరించుకోకపోవడంతో శుక్రవారం జిల్లాలోని దళిత సంఘాల నాయకులు రాఘవాపూర్‌కు చేరుకుని గద్దెను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వచ్చి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. దీంతో దీనిని సోమవారానికి వాయిదా వేశారు.

ప్రబలుతున్న విష జ్వరాలు, డెంగ్యూ

- దవాఖానల్లో వైద్య పరీక్షలు
- గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్న అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 30 : గ్రామాల్లో విషజ్వరాలు, డెంగ్యూ విజృంభించడంతో దవాఖానలకు రోగుల తాకిడి పెరిగింది. రెండు రోజుల్లో స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, పాంనూర్, ఇప్పగూడెంలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సీబీపీ, ఫీవర్ ప్రొఫైల్ సంబంధించి 70, డెంగ్యూ 15 మంది వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. కాగా ప్లేట్‌లెట్స్ 50 వేల వరకు పడిపోయినప్పటికీ వైద్య చికిత్స అందిస్తుండడంతో కొంత మెరుగవుతున్నది. 50 వేల కంటే తక్కువగా ప్లేట్‌లెట్స్ నమోదైన వారిని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు పంపుతున్నారు. విషజ్వరాలు మరింత పెరగడంతో గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి మందులు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విషజ్వరాలతో ఇద్దరు మృతి చెందడంతో శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. పాంనూర్‌లో డెంగ్యూ కేసు నమోదవడంతో పరిసరాల్లో స్ప్రే చేసి జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ సంధ్యారాణి, డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ సుదీర్ కుమార్, జనార్దన్, సీహెచ్‌వో వెంకటస్వామి, సూపర్‌వైజర్ సునంద, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో రోగులు

కొడకండ్లలో హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు

కొడకండ్లలో ఇంటింటి జ్వర సర్వే

కొడకండ్ల : మండలంలోని రంగాపురం, సర్పంచ్ తండ, మొండ్రాయిలో శుక్రవారం డాక్టర్ హరికృష్ణ నేతృత్వంలో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కొడకండ్లలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను వైద్య సిబ్బంది పరిశీలించి పరిశుభ్రతకు పలు సూచనాలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అవసరమైన వారికి మందులు అందించారు. డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ మండలంలో ఏడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

ఆధునీకరణ పనుల్లో నాణ్యత పాటించాలి

కొడకండ్ల, ఆగస్టు 30 : అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ పనులు నాణ్యతగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మొండ్రాయిలో అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని పింకేశ్‌కుమార్ కోరారు. మరోవైపు గ్రామాల్లో పరిసరాలతోపాటు ప్రజలు తమ ఇళ్ల వద్ద పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని, దోమలు గుడ్లు పెట్టకుండా టైర్లు, పాత వస్తువుల్లో నీరు లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బందితోపాటు ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

సీపీఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలి

టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ ఖాజా షరీఫ్

జనగామ, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగుల పాలిట శాపంలా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అంతమయ్యేదాక పోరాటం చేస్తామని టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ ఖాజా షరీఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో టీజీవో ప్రధాన కార్యదర్శి నీలం కొర్నెలియస్ అధ్యక్షతన శుక్రవారం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) భాగస్వామ్య సంఘాల సమావేశం జరిగింది. ఖాజాషరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవనాన్ని కొనసాగిస్తూ ఆర్థిక భరోసా కల్పిగి ఉండాలంటే పాత పెన్షన్ విధానం ఒక్కటే మార్గమన్నారు. కార్పొరేట్ శక్తుల కోసమే సీపీఎస్‌ను తీసుకొచ్చారని, ఇది ఎంతమాత్రం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదన్నారు. దీనిని రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించే ర్యాలీకి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు, ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. టీజీవో ప్రధాన కార్యదర్శి నీలం కొర్నెలియస్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం ఓ వైపు పోరాటం చేస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మరింత మెరుగైన విధానమంటూ ఓపీఎస్ తీసుకురావడం ఉద్యోగులను మోసం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. టీఎన్‌జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, ఆకుల శ్రీనివాస్ రావు, డీటీఎఫ్ ఉపాధ్యక్షులు చొక్కయ్య, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, సీపీఎస్ నాయకులు భాస్కర్, టీఎన్‌జీవో నాయకులు కొండ సంపత్‌కుమార్, రామనర్సయ్య, ఉప్పలయ్య, నాగార్జున, ప్రభాకర్, రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, విష్ణుబాబు, శ్రీధర్, యాకూబ్, చందర్ పాల్గొన్నారు.

జనగామలో నిర్వహించిన సమావేశంలో అభివాదం చేస్తున్న సంఘాల ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిల్పూరు, ఆగస్టు 30 : మండలంలోని చిన్నపెండ్యాల హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నుంచి చిన్నపెండ్యాల వైపు వస్తున్న మంచోజు సోమయ్య, పరకాలకు చెందిన సుధామల్ల శోభన్‌బాబు బైక్‌లపై వస్తూ చిన్నపెండ్యాల హైవే శివారులోని యాటర్న్ వద్ద ఢీకొన్నారు. ఈ ఘటనలో సుధామల్ల శోభన్ బాబుతోపాటు అతడి భార్య హరితకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించామని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక